క్లుప్తంగా

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు ఈ నెల 26వ తేదీలోగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో రిజిస్ట్రేషన్ చేసుకుని అడ్మిషన్ పొందాలని కోరారు. మరిన్ని వివరాలకు కళాశాల పనివేళలో తమను సంప్రదించాలని సూచించారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

టెక్కలి: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని అప్నా ధోబీ సమాజ్ సలహాదారుడు చలపాక రమణ కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్.మాధవ్‌కు విన్నవించినట్లు పేర్కొన్నారు. ఏపీతో పాటు సుమారు పది రాష్ట్రాల్లో రజకులు బీసీ జాబితాలో ఉండడం వలన అనేక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారన్నారు. ఈయనతో పాటు యండమూరి సీతయ్య, అనిశెట్టి చిట్టెన్న, చంద్రశేఖర్ ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం


విరాళం అందజేస్తున్న బాలరాజు

కంచిలి: కంచిలిలో కొలువై ఉన్న కంచమ్మతల్లి అమ్మవారి ఆలయం అభివృద్ధికి పలువురు భక్తులు విరాళాలను ఆలయ అభివృద్ధి కమిటీకి బుధవారం అందజేశారు. ఇందులో కంచిలికి చెందిన రత్నాల బాలరాజు కుమారుడు భార్గవ్ ఉద్యోగం సంపాదించిన తర్వాత తన మొదటి సంపాదనలో రూ. 10 వేలను ఆలయ అభివృద్ధికి విరాళంగా అందించారు. అలాగే పెద్దకొజ్జిరియా గ్రామానికి చెందిన ఎలుసూరి చక్రధర్ రూ. రెండు వేలు అందజేయగా.. కంచిలికి చెందిన కాసులదేవి చలపతిరావు ఆలయంలో అన్నప్రసాద కార్యక్రమానికి అవసరమైన రెండు అండాలు, రెండు గరిటెలను సమకూర్చారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

సోంపేట: మండలంలోని కొర్లాం 33/11 కేవీ సబ్‌స్టేషన్ మామిడిపల్లి ఫీడర్ పరిధిలో ఈ నెల 22వ తేదీన చెట్ల కొమ్మలను తొలగించే పనులు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఆ రోజు ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్టు పలాస ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.యజ్ఞేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మామిడిపల్లి, సిరిమామిడి, గొల్లూరు, టి.శాసనాం, ఉప్పలాం పంచాయతీల పరిధిలోని గ్రామాలకు సరఫరా నిలిపి వేస్తామని వినియోగదారులు గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించండి

నందిగాం: గ్రామాల్లో పారిశుద్ధ్యంపై దృష్టిసారించి వ్యాధులు ప్రబలకుండా చూడాలని కార్యదర్శులకు ఎంపీడీవో తుల రాజారావు సూచించారు. మండలాభివృద్ధి కార్యాలయం నుంచి మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో జూమ్ మీటింగ్ బుధవారం నిర్వహించి మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాలతో గ్రామాల్లో అపరిశుభ్ర వాతావరణం కోవడం, మంచినీరు కలుషితమై ఉంటుందని అన్నారు. వాటి వలన ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని, నీటి వనరుల్లో క్లోరినేషన్ చేయించాలన్నారు.

గణేష్ మండపాలకు అనుమతి తప్పనిసరి

● సీఐ మంగరాజు

కంచిలి: వినాయక చవితి సందర్భంగా నిర్వహించే ఉత్సవ మండపాలకు ప్రభుత్వ అనుమతులు తప్పనిసరిగా ఉండాలని సోంపేట సీఐ బి.మంగరాజు స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ప్రతి వినాయక మండపం వివరాలను ప్రభుత్వం అమలు చేస్తున్న 'వినాయక ఉత్సవ్'అనే ప్రత్యేక యాప్‌లో సంబంధిత పూజా మండపం కమిటీవారు నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదు చేసుకుంటే.. అనుమతులు ఇవ్వాల్సిన వివిధ శాఖల సిబ్బంది వచ్చి మండపం వద్ద నిబంధనల ప్రకారం ఏర్పాట్లు అన్నీ ఉన్నవీ లేనివీ చూసి అనుమతులు మంజూరు చేస్తారని పేర్కొన్నారు.

ప్రమాద కూడళ్లు!


బూరగాం గ్రామ కూడలి వద్ద ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు

● ప్రమాదకరంగా మారిన మకరాంపురం, బూరగాం, జలంత్రకోట జంక్షన్లు
● అండర్ పాసేజ్‌ల కోసం డిమాండ్

కంచిలి:

జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న పలు కూడళ్ల ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. కంచిలి మండలంలోని వివిధ గ్రామాల వద్ద ఎస్.హెచ్-16 రహదారిలోని జంక్షన్లు భయం గొల్పుతున్నాయి. ఈ రహదారిని విస్తరించి ఆరులైన్లగా అభివృద్ధి చేసినప్పటికీ అవసరమైన కూడళ్లలో బ్రిడ్జిలు నిర్మించలేదు. ఈ పరిస్థితిలో రద్దీగా ఉండే, తరచూ ప్రమాదాలు జరిగే కూడళ్ల గ్రామాల వద్ద అండర్‌పాసేజ్‌లు నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. మకరాంపురం వద్ద ఆదివారం సంత కూడలి, బూరగాం గ్రామం, జలంత్రకోట కూడలి వద్ద అండర్ పాసేజ్ మార్గాలు నిర్మించాల్సి ఉంది. ఈ జంక్షన్ల మీదుగా నిత్యం రాకపోకలు సాగించే వివిధ గ్రామాల ప్రజలు, రోడ్డు అవతలి వైపు పంట పొలాలు కల్గిన రైతులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఉన్న రహదారిని దాటి వెళ్లే సమయాల్లో ఎన్నో ప్రమాదాలు సంభవించి పదుల సంఖ్యలో మృతిచెందిన సంగతిని దృష్టిలో పెట్టుకొని ఈ రోడ్డును మరింత విస్తరిస్తే భవిష్యత్తులో దీన్ని ఎలా దాటి అవతలివైపుకు వెళ్లాలో అనే మీమాంసలో పడుతున్నారు. బూరగాం గ్రామ కూడలి నుంచి కంచిలి, సోంపేట మండలాలకు చెందిన అనేక గ్రామాల వారు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. ఇక్కడ రోడ్డును క్రాస్ చేసి సోంపేటకు, బూరగాం తదితర గ్రామస్తులు కంచిలి, పలాస ప్రాంతాలకు వెళ్లాలంటే ఇక్కడి నుంచి రోడ్డు క్రాస్ చేసి వెళ్లాల్సి ఉంది. ముఖ్యంగా ఈ గ్రామస్తులకు చెందిన 90 శాతానికి పైగా పంట పొలాలన్నీ గ్రామం నుంచి జాతీయ రహదారికి అవతలివైపే ఉన్నాయి. అలాగే స్నానాల చెరువు, శ్మశానవాటిక, గ్రామదేవత ఆలయం, కొత్తగా విస్తరిస్తున్న గ్రామంలో కొన్ని కుటుంబాలు నివసిస్తున్నాయి. దీంతో నిత్యం రోడ్డును దాటి వెళ్లక తప్పదు. ఈ క్రమంలో గ్రామస్తులతోపాటు, ఈ రోడ్డు దాటి ప్రయాణించే వారు ఇక్కడ రోడ్డు ప్రమాదాలకు గురై ప్రాణాలు పోగొట్టుకొన్నారు. రోడ్డు విస్తరించిన తర్వాత ఈ పరిస్థితి మరింత ఎక్కువయ్యాయి. అలాగే ఈ కూడలి తర్వాత కంచిలి వైపు వెళ్లే మార్గంలో జలంత్రకోట గ్రామ కూడలి వద్ద కూడా ఇదే పరిస్థితి. ఇక్కడ కూడా గతంతో ఎంతో మంది ప్రమాదాలు పోగొట్టుకొన్నారు. దీన్ని కూడా ప్రమాదాలు జరిగే కూడలిగా పోలీసులు గుర్తించారు. ఈ కూడలి నుంచి జలంత్రకోట, గోకర్ణపురం, జె.శాసనాం గ్రామ పంచాయతీలో వివిధ గ్రామాలతోపాటు, గిరిజన గ్రామాలు, సోంపేట మండలంలోని పలు గ్రామాలకు ప్రధాన మార్గంగా ఉపయోగపడుతోంది. జలంత్రకోట, బూరగాం పంచాయతీలకు చెందిన రైతుల పంట పొలాలన్నీ ఈ కూడలికి ఇరువైపులా ఉన్నాయి. వ్యవసాయ సీజన్‌లో పెద్ద ఎత్తున రాకపోకలు సాగుతుంటాయి. రోడ్డు విస్తరించిన తర్వాత ఎలా రోడ్‌ను క్రాస్ చేయాలనేది అంతుపట్టడం లేదని ఆ ప్రాంత రైతులంతా ఆందోళన చెందుతున్నారు. పైగా వివిధ కూడళ్లలో అండర్‌పాసేజ్ సదుపాయం కల్పిస్తున్నప్పటికీ, బూరగాం, జలంత్రకోట కూడళ్ల వద్ద ఆ సౌకర్యం కల్పించలేదని రోడ్డు నిర్మాణ బాధ్యతలు చేపట్టే యాజమాన్యం, ఎన్‌హెచ్ అధికార సిబ్బంది నుంచి సమాచారం అందడంతో గందరగోళమైన పరిస్థితి ఏర్పడింది. ఈ రెండు చోట్ల అండర్‌పాసేజ్ మార్గాలు మంజూరు చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఆయా ప్రాంతాలవారు స్పష్టం చేస్తున్నారు.


ప్రమాదాలకు నిలయంగా ఉన్న జలంత్రకోట జంక్షన్

బూరగాం ప్రమాదాల కూడలి..



బూరగాం గ్రామం వద్ద జంక్షన్ ప్రమాదాల కూడలిగా మారింది. ఈ విషయం అందరికీ తెలిసిందే. రోడ్డు విస్తరణ చేపడితే మరిన్ని ప్రమాదాలకు అవకాశం ఉంది. ఎన్‌హెచ్ అధికారులు ప్రత్యేక దృష్టిసారించి అవసరమైన చర్యలు చేపట్టాలి.

–మద్దు వెంకటరావు, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షుడు, బూరగాం, కంచిలి మండలం

రైతులకు ఇబ్బంది..



జలంత్రకోట కూడలి వద్ద రెండువైపులా ఉన్న పంట పొలాల రైతులు రోడ్డు విస్తరణ జరిగిన తర్వాత రాకపోకలు సాగించేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇంతటి ప్రాధాన్యత గల కూడలి వద్ద అండర్ పాసేజ్‌ను ఎందుకు విస్మరించారో అర్థం కావడం లేదు. ఎట్టి పరిస్థితుల్లోనైనా ఇక్కడ అండర్ పాసేజ్ నిర్మించకపోతే మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

–మాధవరావు, యువకుడు, చిలకలమెట్ట, జలంత్రకోట పంచాయతీ

అండర్‌పాసేజ్‌లు నిర్మించాలి..



అత్యంత రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న బూరగాం, జలంత్రకోట జంక్షన్ల వద్ద అండర్ పాసేజ్‌లు నిర్మించాలి. దీనిపై అధికార యంత్రాంగం దృష్టిసారించాలి. ఇప్పటికే ఈ జంక్షన్ల వద్ద జరిగిన ప్రమాదాల్లో చాలా మంది ప్రాణాలు పోగొట్టుకొన్నారు. అధికార యంత్రాంగం స్పందించి అవసరమైన చర్యలు చేపట్టకపోతే ఆందోళనలు చేపడతాం.

–పైల దేవదాస్‌రెడ్డి, ఎంపీపీ, కంచిలి

మాజీ మంత్రి పరామర్శ


పరామర్శలో మాజీమంత్రి అప్పలరాజు తదితరులు

పలాస: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలోని ఒకటో వార్డు మొగిలిపాడు గ్రామానికి చెందిన దున్న దుర్గమ్మ ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పలాస నియోజకవర్గం సమన్వయకర్త డాక్టర్ సీదిరి అప్పలరాజు మృతురాలి కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కౌన్సిలర్ దున్న సత్యం, పట్టణ పార్టీ అధ్యక్షుడు శిష్టు గోపి, మాజీ ఎంపీపీ బత్తిన హేమేశ్వరరావు, అంబటి ఆనందరావు, నర్తు వెంకటరమణ, డిల్లీ మాస్టార్, కృష్ణ ఉన్నారు.

పోస్టల్ ఉద్యోగుల నిరసన


ధర్నాలో పోస్టల్ సిబ్బంది

పలాస: న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ కాశీబుగ్గ పోస్టల్ ఉద్యోగులు కార్యాలయం ఆవరణలో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎనిమిదో వేతన కమిటీ విధివిధానాలను వెంటనే అమలు చేయాలని, గ్రామీణ తపాల ఉద్యోగులను డిపార్టుమెంటు ఉద్యోగులుగా గుర్తించాలని, ఎనిమిది గంటల పనిభారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో ఏఐజీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఎస్.నందికేశ్వరరావు, జీడీఎస్ వెంకటరమణ, పి.ప్రకాశరావు, కె.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సర్వసభ్య సమావేశం బహిష్కరణ

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పంచాయతీ సర్వసభ్య సమావేశాన్ని పలువురు వార్డు సభ్యులు బహిష్కరించారు. పంచాయతీ పరిధిలో 20 వార్డులకు సంబంధించి పూర్తిస్థాయిలో సభ్యులు హాజరు కాకపోవడం గమనార్హం. అయితే గతంలో తమవార్డు పరిధిలో గుర్తించిన అభివృద్ధి పనులను కొంతమంది అధికార పార్టీ కార్యకర్తలు తమకు తెలియకుండా చేశారని.. అటువంటి వాటికి ఎలా అంగీకారం తెలియజేస్తామని పలువురు వార్డు సభ్యులు ఈవో శ్రీనివాస్ ఎదుట స్పష్టం చేశారు. అజెండా కాపీలో కొన్ని అంశాలను తారుమారు చేశారంటూ సభ్యులు ఆరోపించారు. పంచాయతీ పరిధిలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమానికి అంతా సహకరించాలని, తదుపరి సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకుందామని ఈవో సభ్యులకు విజ్ఞప్తి చేశారు.

వంశ'ధార'కు జలహారతి

వజ్రపుకొత్తూరు: మండలంలో శివారు పాతాలైన పెద్దబొడ్డపాడు, సీతాపురం, కొండవూరు, బెండి తదితర గ్రామాలకు వారం రోజులుగా వంశధార జలాలు చేరుతున్నాయి. ఈ నేపథ్యంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష బుధవారం పెద్దబొడ్డపాడు రామ చెరువు వద్ద జలహారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శివారు ఆయకట్టుకు కూడా సాగునీరు అందేలా కృషి చేస్తున్నామని..ఇదే విషయాన్ని కలెక్టర్‌ను సైతం కలిసి కోరినట్టు చెప్పారు. వంశధార ఈఈ బి.శేఖర్‌రావు, ఏఈఈ టి.రాజశేఖర్‌రాజు, స్థానిక నేతలు దుంపల వల్లభరావు, ఉప్పాడ కృష్ణారావు, సూరాడ మోహనరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కణితి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన తప్పనిసరి


ర్యాలీ చేస్తున్న యూపీహెచ్‌సీ సిబ్బంది

ఇచ్ఛాపురం: దోమల వల్ల వ్యాపించే వ్యాధుల పట్ల ప్రజలంతా అవగాహన కలిగి ఉండాలని బెల్లుపడ యూపీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ అఖిల్ మనోహర్ అన్నారు. ప్రపంచ దోమల నివారణా దినోత్సవం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దోమల వల్ల వ్యాప్తిచెందే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. యూపీహెచ్‌సీ నుంచి బెల్లుపడ గ్రామం వరకూ నిర్వహించిన అవగాహన ర్యాలీలో వైద్యసిబ్బంది రాఘవ, వెంకట్, లక్ష్మి, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తప్పవు

సాక్షి ఎఫెక్ట్...

సంతబొమ్మాళి: సాగునీటి కాలువలను ఆక్రమించి రైతులకు ఇబ్బందులు కలిగిస్తున్న వారిపై చర్యలు తప్పవని టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి అన్నారు. 'ఆక్రమణలో కాలువ గట్లు'శీర్షికతో 'సాక్షి'లో బుధవారం ప్రచురితమైన కథనానికి ఆర్డీవోతోపటు సంతబొమ్మాళి తహసీల్దార్ హేమసుందరరావు స్పందించారు. సాగునీటి కాలువ ఆక్రమణలు తమ దృష్టికి వచ్చిందని, త్వరలోనే చర్యలు తీసుకుంటామని ఆర్డీవో కృష్ణమూర్తి పేర్కొన్నారు. తహసీల్దార్ సుందరరావు మాట్లాడుతూ.. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా పరిశీలన చేస్తామని అన్నారు. హెచ్ఎన్ పేటలో సాగునీటి కాలువ ఆక్రమించిన రియల్ ఎస్టేట్ వ్యాపారికి ఇప్పటికే నోటీసులు ఇచ్చినట్లు చెప్పారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు పయనం


జగదీష్‌ను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

ఇచ్ఛాపురం: తాడేపల్లిగూడెంలో ఈనెల 24వ తేదీ నుంచి జరుగనున్న రాష్ట్రస్థాయి యోగా పోటీలకు పట్టణానికి చెందిన పాలేపు జగదీష్ పయనమయ్యాడు. ఈ నెల మూడో తేదీన జాతీయ యోగాసన స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించగా పట్టణంలోని జ్ఞానభారతి పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న పాలేపు జగదీష్ 14 సంవత్సరాల విభాగంలో మొదటిస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. బుధవారం పయనమై వెళిలన జగదీష్‌ను పాఠశాల కార్యదర్శి జోహార్‌ఖాన్, ప్రిన్సిపాల్ ఐ.బి.పండా, హెచ్ఎం రషీదాసుల్తానా, వ్యాయామ ఉపాధ్యాయులు కైలాష్‌పండా, డి.రాము, సిబ్బంది సయ్యద్‌సుల్తానా, అమీర్‌ఆలీ అభినందించారు.

పేకాటరాయుళ్లు అరెస్టు

టెక్కలి రూరల్:

స్థానిక బ్రాహ్మణవీధిలో పేకాట శిబిరం నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు మంగళవారం రాత్రి టెక్కలి ఎస్ఐ-2 రఘునాథరావు తన సిబ్బందితో కలిసి దాడి నిర్వహించారు. దీనిలో భాగంగా పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 50,200లు స్వాధీనం చేసుకొని, కేసులు నమోదు చేసినట్లు పోలీసులు బుధవారం తెలిపారు.

అనధికారి లేఅవుట్లను క్రమబద్ధీకరించాలి


మాట్లాడుతున్న కమిషనర్ రామారావు

పలాస: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.రామారావు చెప్పారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ప్లానింగ్ కార్యదర్శులు, లైసెన్సు సర్వేయర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలోమొత్తం 22 అక్రమ లేఅవుట్లు ఉన్నాయని, వాటిని క్రమబద్ధీకరించుకోవడానికి తగిన అవకాశాలు ఉన్నాయని చెప్పారు. క్రమబద్ధీకరించుకోవడానికి పది శాతం రాయితీ కూడా ఉందని.. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్లానింగ్ కార్యదర్శులు, లైసెన్సు సర్వేయర్లు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

ఇళ్ల పట్టాలు పంపిణీ

పలాస: కాశీబుగ్గ రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్వాసితులకు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఇళ్ల పట్టాలను బుధవారం పంపిణీ చేశారు. పలాస తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కార్యాక్రమంలో 89 మందికి పట్టాలను ఆమె అందజేయగా.. ఆర్డీవో జి.వెంకటేశ్, తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి పాల్గొన్నారు.

కథల పోటీలో విద్యార్థి ప్రతిభ

కవిటి: జాతీయస్థాయి కథల పోటీల్లో ముత్యాలపేట జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి బెందాళం సిద్ధార్థ్ ప్రతిభకనబర్చాడు. తెలంగాణా రాష్ట్రం ఖమ్మం జిల్లాకు చెందిన స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన పోటీలో తాను రాసిన 'మొక్కవోని దీక్ష'కథ ఉత్తమ రచనగా ఎంపికైందని ఉపాధ్యాయుడు మొర్రి గోపి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థిని ఉపసర్పంచ్ పాతిన చంద్రశేఖరం,ఆరంగి శివాజీ, కె. భీమసేన్, పి.వెంకటరావు అభినందించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

పలాస: పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నివారణ సాధ్యమని రెంటికోట పీహెచ్‌సీ వైద్యాధికారి సునీర్‌కుమార్ అన్నారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవాన్ని పీహెచ్‌సీ వద్ద బుధవారం నిర్వహించి అవగాహన కల్పించారు. గ్రామాల్లో దోమల సమస్య ఉందని.. వాటి నుంచి అధిగమించాలంటే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ముఖ్యంగా దోమ తెరలు పెట్టుకోవాలన్నారు. సీహెచ్‌వో ఆదమ్మ, సూపర్వైజర్లు బి.పద్మావతి, ఫార్మసీ ఆఫీసర్ బోనెల గోపాల్, కోటేశ్వరరరావు, రాజేశ్వరి, మేరీ బాయి, త్రివేణి, సుహాసిని పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

టెక్కలి: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం ఆధ్వర్యంలో 2025–26 విద్యా సంవత్సరానికి టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓపెన్ ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి.తిరుపతిరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం కళాశాలలో దీనికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఎంపీసీ, బైపీసీ, ఎంబైపీసీ, ఎంఈసీ, హెచ్ఈసీ, సీఈసీ కోర్సులలో ప్రవేశానికి సెప్టెంబర్ 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆటో డ్రైవర్లతో సర్కార్ ఆటలు!

● ఎన్నికల హామీని అమలు చేయని వైనం
● రూ. 15 వేల సాయం ఎక్కడ?

వజ్రపుకొత్తూరు:

అధికారం కోసం బూటకపు హామీలు ఇవ్వడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు అలవాటేనని ఆటో డ్రైవర్లు విమర్శిస్తున్నారు. ఏడాది క్రితం జరిగిన ఎన్నికల సమయంలో అన్నివర్గాల ప్రజలు మాదిరిగానే తాము కూడా మోసపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలతో పాటు ఆటో, ట్యాక్సీ లైసెన్స్ కలిగిన లారీ, టిప్పర్ డ్రైవర్లకు ఏటా రూ. 15 వేలు ఆర్థిక సహాయం అందిస్తామని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, ప్రమాద, ఆరోగ్య బీమా కల్పిస్తామని మేనిఫెస్టోలో పేర్కొంది. ఎన్నికల సమయంలో కూటమి నేతలు దీనిపై విస్తృతంగా ప్రచారం చేశారు. అయితే కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఈ హామీ అమలుకు నోచుకోలేదు. ఆటో డ్రైవర్లతో కూటమి సర్కార్ ఆటలు మానుకొని ఇచ్చిన మాట ప్రకారం కనీసం ఆర్థిక సాయమైనా అందిచాలని డిమాండ్ చేస్తున్నారు. పలాస నియోజకవర్గంలో సుమారు 1260 ఆటోలు, 120 వరకు మ్యాక్సీ క్యాబ్‌లు, 16 వరకు టిప్పర్‌లు ఉన్నాయి. బస్సులు లేనప్పుడు ప్రయాణికులు ఆటోలపై ఆధారపడి గమ్యస్థాలకు చేరుకుంటారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్సులు లేని గ్రామీణ ప్రాంతాలకు ఆటోలే ఆధారం.

తగ్గిన ఆదాయం.. పెరిగిన ఖర్చులు..

ఆటో నిర్వహణకు సాధారణంగా ఖర్చులు ఉంటాయి. ప్రస్తుతం పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలతో ఆటో డ్రైవర్లు రోజంతా కష్టపడినా కనీసం రూ. 200 నుంచి రూ.300 కూడా మిగలని పరిస్థితి. ఏటా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల కోసం దాదాపు రూ.15 వేలు ఖర్చు అవుతోంది. అలాగే తనిఖీలు పేరుతో పోలీసులు, రవాణా శాఖ అధికారులు దాడులు చేసి వేల రూపాయలు జరిమానా విధిస్తున్నారు. ఆటో కొనుగోలు కోసం తీసుకున్న రుణాలు నెలవారీ వాయిదాలు కట్టుకోలేక ఆటో కార్మికుల బతుకులు దినదిన గండంగా మారిపోయిందని వాపోతున్నారు.

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో..

గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ఏటా బడ్జెట్ కేటాయించేది. అర్హులైన ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు ఏడాదికి రూ. 10 వేలు వారి ఖాతాల్లో జమ చేసేది. దీంతో పాటు వాహన డ్రైవర్ ప్రమాదవశాత్తు మృతి చెందితే వారి కుటుంబ సభ్యులకు రూ. 10 లక్షల బీమా అందించేవారు. అలాగే రవాణా వాహనం కొనుగోలుకు బ్యాంక్ నుంచి రుణాలు తీసుకునే డ్రైవర్‌కు రూ.మూడు లక్షల వరకు వడ్డీ రాయితీ అందించి భరోసా కల్పించారు. దీంతో డ్రైవర్లు తమ కుటుంబ సభ్యుల పోషణకు ఇబ్బందిలేకుండా దర్జాగా ఉండేవారు. ప్రస్తుత కూటమి సర్కార్ హయాంలో ఎలాంటి భరోసా లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.


బేరాల్లేక పూండి స్టాండ్‌లో నిలిచి ఉన్న ఆటోలు

భారమైన కుటుంబ పోషణ

పదేళ్లుగా ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నా. ప్రస్తుతం డీజిల్, పెట్రోల్ ధరలు ఆకాశాన్నింటుతున్న తరుణంలో కుటుంబ పోషణ భారంగా మారింది. దీనికి తోడు గతంలో మాదిరి ప్రస్తుతం ఆటోలకు అంత గిరాకీ ఉండడం లేదు. ఇలాంటి పరిస్థితిలో ఆటో డ్రైవర్లకు ఆర్థికసాయం చేయాలి. తమను ప్రభుత్వం ఆదుకోవాలి.


–ఎల్.చక్రధరరావు ఆటో డ్రైవర్, హరిపురం

రూ. 15 వేలు వెంటనే అందించాలి

రోజంతా కష్టపడి ఆటో నడిపినా కుటుంబ పోషణ కష్టంగా మారింది. నిత్యావసర సరుకులతో పాటు ఇంధన ధరలు పెరిగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఆటో ఫైనాన్స్, పెరిగిన బీమా ప్రీమియం, రోడ్డు ట్యాక్స్‌లు కట్టుక లేక సతమతమవుతున్నాం. ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వం ఆటో కార్మికులకు 15 వేల రూపాయల సాయం అందించాలి.

– కె.రాము, ఆటో కార్మికుడు, పలాస


చె(చి)త్త శుద్ధిలేదు!



టెక్కలి మేజర్ పంచాయతీలో చెత్త సమస్య వేధిస్తుంది. చాలామంది వ్యాపారులు చెత్తను రోడ్లపై పడేస్తుండడంతో ఇబ్బందులు ఎదురౌతున్నాయి. ఇందిరాగాంధీ, అంబేడ్కర్ జంక్షన్, తెంబూర్ రోడ్డు జంక్షన్ల వద్ద ఉన్న పలు దుకాణాల్లో ఉన్న చెత్తను రాత్రి సమయంలో రోడ్లపై విచ్చలవిడిగా పడేస్తుండగా.. వాటి చుట్టూ ఆవులు, కుక్కలు, పందులు చేరి పాడుచేస్తుండడంతో పారిశుద్ధ్యం క్షీణించడంతోపాటు అటుగా వెళ్తున్న వాహనదారులపై పడుతూ ప్రమాదాలకు కారణమౌతున్నాయి. పంచాయతీ అధికారులు స్పందించి తగుచర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

–టెక్కలి రూరల్


ఎంటీఎస్ ఉపాధ్యాయుడి ఔదార్యం



కవిటి మండలం ముత్యాలపేట మోడల్ ప్రైమరీ స్కూల్‌లో పనిచేస్తున్న ఎంటీఎస్ ఉపాధ్యాయుడు తూతిక వెంకటరమణ ఔదార్యాన్ని చాటుకున్నారు. పాఠశాలలో చదువుతున్న 50 మంది పిల్లలకు సొంత నిధులతో స్టీల్ భోజనం ప్లేట్లను వితరణగా సమకూర్చారు. వీటిని గ్రామ పెద్దల సమక్షంలో బుధవారం విద్యార్థులకు అందజేశారు. ఇటీవలే ఈ పాఠశాలకు వచ్చిన వెంకటరమణ చూపిన చొరవను గ్రామపెద్దలు పాతిన చంద్రశేఖరం,ఆరంగి శివాజీ,పి వెంకటరావు,పి పద్మనాభం అభినందించారు.

–కవిటి

రోడ్లు శిథిలం!



మండపల్లి గ్రామ ప్రధాన రహదారి శిథిలం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మరమ్మతుల పేరుతో రోడ్డు గుంతలు పూడ్చింది. ఇటీవల కురిసిన వర్షాలకు మళ్లీ యథావిధిగా గుంతలమయమైంది. సంబంధిత అధికారులు స్పందించి గుంతలు పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

–ఇచ్ఛాపురం రూరల్